





## పాఠశాల మరుగుదొడ్డిలో నాగుపాము



లెట్రిన్ బేసిన్‌లో ఉన్న పాము

కోట మండలం ఉత్త మనెల్లూరు పంచాయతీ పరిధిలోని తాటిగుంటచెరువు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల మరుగుదొడ్డిలో గురువారం ఓ నాగుపాము ప్రత్యక్షమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక మరుగుదొడ్లు ఉన్నాయి. ఇందులో ఓ మరుగుదొడ్డిలోని బేసిన్‌లోకి నాగుపాము చొరబడింది. ఇంటర్వెల్ సమయంలో హెచ్‌ఎం సుజాత ఆ పామును గమనించారు. వెంటనే విద్యార్థులను తరగతి నుంచి బయటకు రానీయకుండా తలుపువేసి స్థానిక గిరిజనులకు సమాచారం ఇచ్చారు. వారొచ్చి గంటసేపు కష్టపడి ఆ పామును అక్కడి నుంచి తరిమివేశారు. దీంతో విద్యార్థులు, టీచర్లు ఊపిరిపీల్చుకున్నారు. పామును గమనించకుండా ఎవరైనా వెళ్లి ఉంటే ప్రమాదం జరిగేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. -కోట

## షార్‌కు చేరిన రాకెట్ పరికరాలు



రాకెట్ పరికరాలతో వెళ్తున్న వాహనం

రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన పరికరాలు గురువారం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)కు చేరాయి. కేరళలోని తిరునంతపురం విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) నుంచి భారీ భద్రత నడుమ రోడ్డు మార్గాన ప్రత్యేక వాహనంలో వీటిని తీసుకొచ్చారు. - సూళ్లూరుపేట

## కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



తిరుపతిలోని కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా మూషిక వాహనంపై వినాయక స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. నేటినుంచి 10రోజుల పాటు బ్రహ్మోత్సవాలకు నేటి ఉదయం 7.40 గంటలకు మీనలగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. 9 నుంచి 11 గంటల వరకు పల్లకీ ఉత్సవం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంసవాహన సేవ జరగనున్నాయి. - తిరుపతి (కల్చరల్)

## కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలోని వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం ఉదయం ధ్వజారోహణ వేడుక వైభవంగా జరిగింది. శాస్త్రోక్తంగా గరుత్మంతుడిని కొత్త వస్త్రంపై లిఖించి కంకణ భట్టర్ శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. రాత్రి వాహన సేవలు ప్రారంభమయ్యాయి. పెద్దశేష వాహనంపై కృష్ణావతారంలో వైకుంఠనాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. - చంద్రగిరి



# వైసీపీలో వర్గపోరు

**మట్టి అక్రమ తవ్వకాలతో పరస్పర దాడులు**

**చొక్కాలు చింపుకున్న ఇరు వర్గాల నాయకులు**

పెళ్లకూరు, ఫిబ్రవరి 29: వైసీపీలోని రెండు వర్గాల మధ్య రోజు రోజుకూ మట్టి, ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా కుంపటి రాజుకుంటోంది. గురువారం సాయంత్రం బంగారంపేట చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతుండగా మొదుగులపాలెం గ్రామానికి చెందిన సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి వచ్చి అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి బంగారంపేటకు చేరుకున్నారు. 'నీవెవ్వరని మట్టి తోలకాలను అడ్డుకోవడానికి' అంటూ బెదిరించడంతో పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇద్దరి చొక్కాలు చిరిగిపోయాయని స్థానికులు తెలిపారు. మరోవైపు సత్యనారాయణరెడ్డికి మద్దతుగా జనం పోగవడం, పొద్దుపోవడంతో శేఖర్‌రెడ్డి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఇది తెలిసి చెంగాళమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కళత్తూరు రామ్మోహన్‌రెడ్డిలు తమ అనుచరులతో కలిసి రాత్రి తొమ్మిది గంటలకు శేఖర్‌రెడ్డికి మద్దతుగా నాలుగు కార్లలో వచ్చారు. అయితే వీరిని వాహనాలు దిగనీయకుండా మోదుగులపాలెం వద్దకెళ్లి సత్యనారాయణరెడ్డి తన అనుచరులతో అడ్డుకున్నారు. అప్పటికే వివాదం పెద్దది అవడంతో బాలచంద్రారెడ్డి, దబ్బల అనుచరులు కూడా రాత్రి 9.30 గంటలకు సంఘటనా స్థలానికి తరలివచ్చారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో విషయం తెలుసుకున్న నాయుడుపేట, పెళ్లకూరు, దొరవారిసత్రం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

**నాయుడుపేట సీఐ కార్యాలయానికి పంచాయితీ**

నాయుడుపేట టౌన్: ఈ పంచాయితీ కాస్తా నాయుడుపేట సీఐ కార్యాలయానికి చేరుకుంది. పరస్పరం ఫిర్యాదులకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. శేఖర్‌రెడ్డి రాత్రి 11.30 గంటలకు సీఐ కార్యాలయానికి చేరుకున్నారు. సత్యనారాయణరెడ్డి మాత్రం రాలేదు. అయితే ఈయన్ను శుక్రవారం ఉదయం రావాలని పోలీసులు సూచించినట్లు తెలిసింది.



మోదుగులపాలెం వద్ద చెరువు కట్ట సమీపంలో గుమికూడిన వైసీపీ శ్రేణులు

# ప్రత్యేకహోదాయే ప్రధానాస్త్రం



- నేడు తిరుపతిలో కాంగ్రెస్ భారీ బహిరంగసభ
- పదేళ్ళ కిందట మోదీ హామీలిచ్చిన చోటే నిర్వహణ
- సచిన్ పైలెట్, షర్మిల తదితర ప్రముఖుల హాజరు

తిరుపతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్రవారం సాయంత్రం భారీ బహిరంగసభ నిర్వహణకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేపట్టింది. ఎస్వీ యూనివర్శిటీ స్టేడియంలో నేటి సాయంత్రం 4 గంటలకు జరగనున్న బహిరంగసభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల,రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు తదితరులు హాజరుకానున్నారు. దీనికోసం సచిన్ పైలెట్ బెంగుళూరు నుంచీ షర్మిల హైదరాబాదు నుంచీ విమానాల్లో తిరుపతి చేరుకోనున్నారు. 2014 ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతిలో నిర్వహించిన బహిరంగసభలో నరేంద్ర మోదీ బీజేపీ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో బీజేపీ సభ నిర్వహించిన ఎస్వీయూ స్టేడియంలోనే ఇపుడు కాంగ్రెస్ పార్టీ కూడా బహిరంగసభ ఏర్పాటు చేస్తోంది. అదే చోట సభ జరిపి మోదీ హామీలను ప్రజలకు గుర్తు చేయడంతో పాటు హామీల అమలుపై మోదీని కాంగ్రెస్ నేతలు నిలదీయనున్నారు. వైఎస్ షర్మిల పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ఇదివరకే తిరుపతిలో సమావేశం నిర్వహించినప్పటికీ అది పార్టీ అంతర్గత సమావేశం. బహిరంగ సభ జరపడం మాత్రం ఇదే తొలిసారి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో తొలి బహిరంగ సభ కావడంతో దీన్ని ఎలాగైనా విజయవంతం చేయాలని పార్టీ నాయకులు శ్రమిస్తున్నారు. 30 వేలమందితో సభ జరపాలని, దానికోసం ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా జనసమీకరణ చేయాలని ప్రయత్నిస్తున్నారు. బహిరంగ సభా స్థలిలో ఏర్పాట్లను గురువారం పీసీసీ మాజీ చీఫ్ గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపీ చింతా మోహన్, పీసీసీ నేత తులసిరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

## వైసీపీ కోటకు వేమిరెడ్డి బీటలు

- వీపీఆర్ వెంట టీడీపీలోకి భారీగా వలసలు



నెల్లూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వైసీపీ నిట్టనిలువునా చీలనుంది. కుట్ర పూరిత రాజకీయాలను తట్టుకోలేక వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి(వీపీఆర్) భారీస్థాయిలో ఆ పార్టీ నాయకులను తనవెంట తీసుకెళుతున్నారు. మార్చి 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు వీపీఆర్ కన్వెన్షన్‌లో జరిగే కార్యక్రమంలో చంద్రబాబు సమక్షంలో వీపీఆర్ దంపతులు టీడీపీలో చేరనున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే స్థాయి కలిగిన నాయకుల నుంచి డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల నాయకులు వందలాదిమంది టీడీపీలో చేరనున్నారు.వైసీపీకి వీపీఆర్ రాజీనామా చేసిన మరుసటి రోజు నుంచే వైసీపీలో అలజడి పెరిగింది. రోజూ వైసీపీకి చెందిన కీలక నాయకులు తమ పదవులకు రాజీనామాలు చేస్తూనే ఉన్నారు. నెల్లూరు సిటీ, రూరల్, సూళ్లూరుపేట, గూడూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు, ఆత్మకూరు నియోజకవర్గాల నుంచి పలువురు కీలక నాయకులు మార్చి 2న టీడీపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ చేరికలతో టీడీపీ మరింత బలపడటంతోపాటు వైసీపీ కోటకు బీటలు వారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**7న గూడూరు,వెంకటగిరిల్లో లోకేష్ శంఖారావం**

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'శంఖారావం' సభలను మార్చి 7వ తేదీన మధ్యాహ్నం గూడూరు, సాయంత్రం వెంకటగిరి నియోజకవర్గాల్లో నిర్వహించనున్నారు. 5వ తేదీ నుంచి ఉమ్మడి నెల్లూరు జిల్లాలో లోకేష్ పర్యటన ప్రారంభం కానుంది.

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

**63,055మంది విద్యార్థులకు 87 కేంద్రాలు**

**మూడు సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు**

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. తొలిరోజు ప్రథమ సంవత్సర విద్యార్థులకు లాంగ్వేజ్ పేపర్-1పరీక్ష జరగనుంది. ఈ నెల 20వ తేదీ వరకు ఉదయం 9-12గంటల మధ్య జరిగే ఈ పరీక్షలను సీసీ కెమెరాల నిఘాలో పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్ఐవో ప్రభాకరరెడ్డి తెలిపారు. కేంద్రాల్లోని సీసీ కెమెరాలను ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా ఇంటర్ బోర్డుతో పాటు ప్రాంతీయ ఇంటర్ బోర్డు కార్యాలయాల్లోని కంట్రోల్ రూమ్స్‌కు అనుసంధానం చేసి, పర్యవేక్షించే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.సమస్యాత్మక కేంద్రాలైన నాగలాపురం, పిచ్చాటూరు, చిన్నగొట్టిగల్లు కళాశాలల్లో రోజూ సిట్టింగ్ స్క్వాడ్ ఉంటుందని, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షిస్తాయని వివరించారు. ప్రాథమిక వైద్య చికిత్స నిమిత్తం ఏఎన్‌ఎం అందుబాటులో ఉంటారని, పరీక్షలు జరిగే రోజు విద్యార్థులు ఆర్టీసీ బసులో ఉచిత ప్రయాణం చేసే వెసులుబాటు ఉందన్నారు.పరీక్షలకు 87 కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో కలిపి 63,055మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు.హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని, హాల్‌టికెట్ చూపిన విద్యార్థులందరినీ అనుమతించాలని ఆర్ఐవో తెలిపారు. కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ఆర్ఐవో కార్యాలయంలోని టోల్‌ఫ్రీ నెంబరు 0877-2237200కి ఫోన్ చేయాలని కోరారు.

## శివరాత్రి ఉత్సవాల్లో సామాన్యులకే పెద్దపీట



సమన్వయ సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: ముక్కంటి ఆలయంలో జరగబోయే మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకే పెద్దపీట వేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని త్రినేత్ర అతిథి భవనంలో గురువారం పలు ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులను గత ఉత్సవాల నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు.ఈ ఏడాది అత్యవసర సేవలపై నిరంతరం అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు.బాల్య వివాహాల నిర్మూలనకు రెవెన్యూ, ఐసీడీఎస్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని చెప్పారు.ఉత్సవాల సమయంలో ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహించాలని వైద్యశాఖను ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని పురపాలక శాఖను, నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అగ్నిమాపక వాహనం, 108 వాహనం ఆలయం వద్దనే నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై ఎస్పీ మలిక గార్గ్ పలు సూచనలు చేశారు.గత ఏడాది ఉత్సవాల్లో బందోబస్తును పర్యవేక్షించిన సీఐ అంజుయాదవ్ సమావేశానికి హాజరై క్యూలైన్ల విధానం, రద్దీ రోజుల్లో బందోబస్తు నిర్వహణ, రథోత్సవం, తెప్పోత్సవంలో చోరీలు జరగకుండా తీసుకున్న జాగ్రత్తలను వివరించారు.అవంతా విన్న ఎస్పీ ఈ ఏడాది అమలు చేయాల్సిన ఏర్పాట్లపై ఆలయంలో తిరిగి కసరత్తు చేశారు.ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, ఆర్డీవో రవిశంకరరెడ్డి, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు కలెక్టర్, ఎస్పీ ఆలయానికెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.నిత్యాన్నదానంలో కలెక్టర్ భక్తులతో కలిసి భోంచేశారు.

## రేషన్ దుకాణాల్లో రాగిపిండి పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28: రేషన్ దుకాణాల్లో రాగిపిండి పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. షుగర్ వ్యాధిగ్రస్తులను దృష్టిలో ఉంచుకుని బియ్యంతో పాటు చౌక దుకాణాల్లో రాగిపిండిని పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రాగిపిండి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.40 ఉండగా చౌకదుకాణాల్లో కేవలం రూ.11కే అందిస్తున్నట్లు వెల్లడించారు.శుక్రవారం నుంచి కేజీ నుంచి మూడు కేజీల వరకు బియ్యానికి బదులుగా రాగిపిండి ఇస్తున్నట్లు తెలిపారు.

# అంతా అయ్యాక అనుమతులు!

- టీటీడీ ఉద్యోగుల లేఅవుట్‌కు వ్యవసాయ భూమి నుంచి రెసిడెన్షియల్‌గా వర్గీకరణ
- ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డు రద్దు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

తిరుపతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిలో ఏదైనా లే అవుట్ వేయాలంటే నివాసయోగ్యమైన స్థలంగా ప్రభుత్వం దగ్గర మార్పుకోవాలి. ఆ తర్వాత స్థానిక పట్టణాభివృద్ధి సంస్థ అప్రూవల్ తీసుకోవాలి. అప్పుడే ప్లాట్లను విక్రయించడం, రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది. కానీ టీటీడీ ఉద్యోగులకు వడమాలపేట దగ్గర ఇచ్చిన ప్లాట్లకు మాత్రం ఇలాంటి నిబంధనలు ఏమీ వర్తించలేదు. ఎలాంటి అనుమతులూ లేకుండానే పేపర్‌పై స్కెచ్ వేసి, లాటరీ తీసి నెంబర్లు కేటాయించేశారు.అంతేకాదు కొందరికి రిజిస్ట్రేషన్ తంతు కూడా పూర్తిచేశారు. అంతా అయ్యాక ఇప్పుడు భూమి మార్పుకోసం అందులోని ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డు రద్దు కోసం ప్రభుత్వ ఉత్తర్వులు తీసుకున్నారు.ఈ మేరకు గురువారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగపు ముఖ్యకార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. వడమాలపేట మండలం, పాదిరేడు అరణ్యం గ్రామంలోని 417.16 ఎకరాల వ్యవసాయ భూమిలో టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. అయితే వ్యవసాయ భూమి నుంచి రెసిడెన్షియల్‌గా వర్గీకరణ జరగలేదు. ఇటీవల జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు దాదాపు రూ.5.5కోట్లు తుడాకు టీటీడీ చెల్లించింది. దీంతో రెసిడెన్షియల్‌గా మార్పు చేయడంతో పాటు సదరు స్థలంలో 60 మీటర్ల తుడా ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డును కూడా రద్దుచేస్తూ శ్రీలక్ష్మి ఉత్తర్వులు ఇచ్చారు.దీనితర్వాత మళ్లీ లే అవుట్ అప్రూవల్ తీసుకోవాల్సివుంది.సాధారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ప్రైవేట్ సంస్థలకు అన్ని అనుమతులూ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తారు. మరి అనుమతులు లేకుండా టీటీడీ ఉద్యోగులకు జరుగుతున్న రిజిస్ట్రేషన్లు ఎంతవరకు చెల్లుబాటవుతాయన్న ఆందోళన ఉద్యోగుల్లో కనిపిస్తోంది.



## ఆస్తి కోసం తమ్ముడినే చంపేశాడు!

- పులిబోనువారిపల్లెవాసి హత్య కేసులో సోదరుడు సహా నలుగురికి రిమాండ్



హతుడు చంద్రశేఖర రెడ్డి (పాత చిత్రం)

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 29: ఆస్తి కోసం అన్నే తన కుమారుడితో కలిసి తమ్ముడిని దారుణంగా నరికి చంపేశాడని పోలీసులు నిర్ధారించారు. తిరుపతి రూరల్ మండలం కాలూరు క్రాస్ వద్ద ఈనెల 25న జరిగిన చంద్రశేఖర రెడ్డి (50) హత్య కేసులో నలుగురు నిందితులను రూరల్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎర్రావారిపాలెం మండలం, నెరబైలు పంచాయితీ, పులిబోనువారిపల్లెకు చెందిన భాస్కరరెడ్డి కుమారులు రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖరరెడ్డి(50)కి నడుమ ఆస్తి తగాదాలున్నాయి. రౌడీషీటరైన రామ్మోహన్‌రెడ్డి కొన్నేళ్లుగా తిరుపతి బొమ్మగుంటలో నివాసం ఉంటుండగా చంద్రశేఖరరెడ్డి స్వగ్రామంలోనే నివసిస్తున్నాడు. చంద్రశేఖరరెడ్డి కుమారులు కాలూరు క్రాస్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతూ హాస్టల్లో ఉంటున్నారు. ఈనెల 25న ఆదివారం కావడంతో పిల్లలను చూసేందుకు చంద్రశేఖరరెడ్డి ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వచ్చాడు.పిల్లలు తినుబండారాలు కావాలనడంతో బయటకు వచ్చిన చంద్రశేఖరరెడ్డి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పాఠశాల సమీపంలోనే మాటువేసిన ఆయన అన్న రామ్మోహన్‌రెడ్డి, ఆయన కుమారుడు పురుషోత్తంరెడ్డి, అతని స్నేహితులు యోగి, చింతకాయల వీధికి చెందిన మరో మైనర్ బాలుడు కలిసి చంద్రశేఖరరెడ్డిపై దాడి చేశారు. బైక్ పైనుంచి కిందపడిపోయిన చంద్రశేఖరరెడ్డి పారిపోయేందుకు ప్రయత్నించగా ఆ ఐదుగురూ వెంటాడి కత్తులతో నరికి చంపారు.మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు గురువారం నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. రామ్మోహన్‌రెడ్డిపై అలిపిరి పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్, ఎర్రావారిపాలెం పోలీసు స్టేషన్‌లో కేసులున్నాయి.



ర్యాలీ నిర్వహిస్తున్న పుదిపట్ల గ్రామస్తులు

## 'బడి' భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 29: పుదిపట్ల తాజా, మాజీ సర్పంచులు బడి సుధాయాదవ్, బడి రామకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. పుదిపట్ల పంచాయితీలో గురువారం సాయంత్రం గ్రామస్తులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీ, మహేంద్ర, మురళి, లక్ష్మయ్యయాదవ్, సిద్ధముని మాట్లాడుతూ 2016 నుంచి పుదిపట్ల పంచాయతీలో భారీ అవినీతి జరిగిందన్నారు. కాలువలు, ప్రభుత్వ భూములను కబ్జా చేసి అమ్మేసుకున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలకు ఇంటి పన్నులు, కొళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు భారీగా లంచాలను వసూలు చేశారన్నారు. వీరి అక్రమాలపైన పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని స్పష్టం చేశారు.

## బుచ్చినాయుడుపల్లెలో ఎన్ఎస్ఎస్ క్యాంప్

చంద్రగిరి, ఫిబ్రవరి 29: చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లెలో గురువారం మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ బ్యూరో యూనిట్ స్పెషల్ క్యాంప్ నిర్వహించింది.ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విద్యావతి ఆధ్వర్యంలో గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, ఇంటి వ్యర్థ పదార్థాలను సరైన పద్ధతిలో తొలగించే విధానాలు, ధూమపానం, మద్యపానం వలన కలిగే ఆరోగ్య సమస్యలు, సెల్‌ఫోన్ దుర్వినియోగం వలన వచ్చే సమస్యల గురించి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.సర్పంచ్ రవినాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి అభివృద్ధి పులివర్తి నానితోనే సాధ్యం

చంద్రగిరి, ఫిబ్రవరి 29: చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధి టీడీపీ ఇన్‌ఛార్జి పులివర్తి నానీకే సాధ్యమని ఆయన తనయుడు పులివర్తి వినీల్ అన్నారు. గురువారం చంద్రగిరి మండలం బందార్లపల్లెలో మీఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినీల్ మాట్లాడుతూ పులివర్తి నానీకి చంద్రగిరి ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలోనే అన్ని వర్గాలకూ సముచిత స్థానం



భాకరాపేట, ఫిబ్రవరి 29: టీడీపీలోనే అన్ని వర్గాలకూ సముచిత స్థానం ఉంటుందని పులివర్తి సుధారెడ్డి అన్నారు. 'మీ ఇంటికి మీ పులివర్తి నాని కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లు మండలం టి.చట్టేవారిపాళెం పంచాయతీలో గురువారం ఆమె పర్యటించారు. సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను పంచుతూ ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, ప్రధాన కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, నాయకులు మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, మునస్వామి నాయుడు, మల్లికార్జున రెడ్డి, వెంకటరత్నం, కొండారెడ్డి, సురేంద్ర, కుమారస్వామి రెడ్డి, చంద్రశేఖర్, విజయశేఖర్ గౌడ్, నాగిరెడ్డి, జేడీ బాలాజీ, మౌలాలి, గురుమూర్తి పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

భాకరాపేట, ఫిబ్రవరి 29: చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అన్ని వసతులు సిద్ధం చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ నాగరాణి తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో చిన్నగొట్టిగల్లు, నెరబైలు జూనియర్ కళాశాలల విద్యార్థులు, ఎర్రావారిపాళెం ఆదర్శ పాఠశాల విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. మొదటిసంవత్సరంలో 209మంది, ద్వితీయ సంవత్సరంలో 200మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు వివరించారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులకు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి రావాలన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

భాకరాపేట,ఫిబ్రవరి 29: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు నాగరాజు తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం చిగరాలచెరువు అరుంధతివాడలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులవివక్ష చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా కులవివక్ష పాటిస్తుంటే తమ దృష్టికి తేవాలన్నారు. దళితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి సత్వరం పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో మల్లికార్జున రెడ్డి, హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వరరావు, దళిత నాయకులు గురుశంకర, 'విన్స్' కో-ఆర్డినేటర్ రహమతుల్లా పాల్గొన్నారు.





దేవతామూర్తుల అలంకరణలో విద్యార్థులు



వాహన సేవలో కోలాటాలు

# పెద్ద శేషుడిపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, ఫిబ్రవరి 29: శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి వైకుంఠనాథుడు పెద్దశేష వాహనంపై దర్శనమిచ్చారు. పట్టుపీతాంబరాలు, బంగారు ఆభరణాలతో కృష్ణావతారంలో స్వామివారిని అలంకరించి పెద్ద శేష వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగించారు.వృషభ, అశ్వ, గజరాజులు ముందు ఠీవిగా నడుస్తుండగా మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనలు, గోవింద నామస్మరణలు నడుమ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి.స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, సహస్ర నామార్చన సేవలు నిర్వహించారు. 8 నుంచి 9.30 గంటల వరకు ఉత్సవమూర్తులు తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తు హోమం, గరుడ లింగహోమం నిర్వహించి ఆలయ ధ్వజస్తంభం వద్దకు చేరుకుని గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవర్ల సమక్షంలో వేదపండితులు మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణల నడుమ ధ్వజారోహణం జరిగింది.టీటీడీ జేఈవో వీరబ్రహ్మం , ఆలయ ప్రత్యేకాధికారి, సీపీ ఆర్వో రవి, డిప్యూటీ ఈవో వరలక్ష్మి, వైఖానస ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు మునిచెంగల్రాయులు, వెంకట స్వామి, అర్చకులు పాల్గొన్నారు. కాగా తమిళనాడుకు చెందిన రామానుజ కైంకర్య ట్రస్టు ప్రతినిధులు రెండు గొడుగులను కానుకగా ఆలయానికి అందజేశారు.



# తుమ్మలగుంట చెరువు పరిరక్షణే ధ్యేయం

● బడి సుధాయాదవ్ నిరాహార దీక్షకు పలు సంఘాల సంఘీభావం



కాగడాల ప్రదర్శనలో పాల్గొన్న బడి సుధాయాదవ్

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 29: తుమ్మలగుంట చెరువు పరిరక్షణ కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ స్పష్టంచేశారు. తుమ్మలగుంట చెరువును పరిరక్షించాలని తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లె సర్కిల్లో గురువారం బడి సుధాయాదవ్ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుడా నిధులు రూ. 100 కోట్లు వెచ్చించి తుమ్మలగుంట చెరువును సర్వనాశనం చేశారని విమర్శించారు. ఇందుకు సంబంధించిన కాంట్రాక్టు పనులు కూడా తన కుమారుడికే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అప్పగించారని ఆరోపించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) కూడా చెరువు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. అయినా రెవిన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారని మండిపడ్డారు. చెరువును పూర్తిగా సర్వే చేసి బఫర్ జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తుడాలో రికార్డు స్థాయిలో అవినీతి జరిగిందని బడి సుధాయాదవ్ ఆరోపించారు. సంబంధిత అధికారులు విచారణ చేపడితే భారీ స్కాం బట్టబయలవుతుందని అభిప్రాయపడ్డారు.తాము వివరాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. త్వరలో ఎమ్మెల్యే బాగోతం బట్టబయలు చేస్తానన్నారు. బండారం బయట పడుతుందనే ఉద్దేశంతోనే తన పంచాయితీకి చెందిన మహిళల చేత తనపై ఫిర్యాదు చేయించారని తెలిపారు. దీక్షకు అనుమతులు లేవంటూ పోలీసుల ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో దీక్షను భగ్నం చేయడానికి పోలీసులు ప్రయత్నించారు. అయితే శాంతియుతంగా దీక్ష చేపడితే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆ మేరకు పోలీసులు వెనుదిరగడంతో దీక్షను కొనసాగించారు. చెరువును రక్షించండి.. నీటిని మళ్లించండి.. అంటూ బడి సుధాయాదవ్ దీక్షకు మద్దతుగా చెర్లోపల్లె సర్కిల్లో గురువారం సాయంత్రం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ దీక్షలకు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ తిరుపతి జిల్లా అధ్యక్షులు నాగార్జున యాదవ్,టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పరసాబాబు, పుదిపట్ల టీడీపీ అధ్యక్షుడు మునిరత్నం, జిల్లా యాదవ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్‌యాదవ్, ముని, సాయి, గణేష్, చంద్ర, అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుణ్యమూర్తి, బాదూరు ఎల్లయ్య, కాపు సంక్షేమ సేన యువత నేత నీలకంఠ, శివరాయల్ తదితరులు సంఘీభావాన్ని తెలియజేశారు.

# ప్రైవేటు భూములపై చెవిరెడ్డి కళ్లు : నాని



మాట్లాడుతున్న పులివర్తి నాని

తిరుచానూరు, ఫిబ్రవరి 29: తిరుచానూరు పంచాయతీలోని ప్రైవేటు భూములపై ఎమ్మెల్యే చెవిరెడ్డి కళ్ల పడ్డాయని టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని విమర్శించారు. 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన తిరుచానూరు పంచాయతీలో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. భూమిని పోగొట్టుకున్న వ్యక్తులు కొందరు నానిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ భూములు, వాగు, వంక పోరంబోకు భూములను ఎమ్మెల్యే ఆయన అనుచరులు కబ్జా చేసేశారని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రైవేటు భూములపై పడ్డారని ధ్వజమెత్తారు. రిజిస్టర్ డాక్యుమెంట్లు ఉన్నా దొంగపత్రాలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. చంద్రగిరిలో చెవిరెడ్డి రాజ్యాంగం నడుస్తోందని అధికారులు సైతం ఎమ్మెల్యేకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ, ప్రైవేటు భూముల సమస్యలకు పరిష్కారం చూపుతా మన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సల్మాన్‌రాజ్, మునిరత్నం రెడ్డి, వాసు, హరేరామ్, పాండి, సాయి రాయల్, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, రమేష్, రమణ రాయల్, నాగూరు, రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై పోటీలు



పాకాల, ఫిబ్రవరి 29: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆర్.సుభాష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై పజిల్ పోటీలు నిర్వహించారు. పొదుపు, డిజిటల్ ఆర్థిక వ్యవహారాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు.సైబర్ నేరాల బారిన పడి మోసపోకుండా ఉండాలని సూచించారు. బ్యాంకు లావాదేవీల గురించి విద్యార్థులకు వివరించారు. క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ మాసిలామణి, అధ్యాపకులు, బ్యాంకు అధికారులు. సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## తిరుచానూరు పుష్కరిణిలోకి భక్తులకు అనుమతి

తిరుచానూరు, ఫిబ్రవరి 29: శ్రీవారి దేవేరి పద్మావతిదేవి కొలువై ఉన్న తిరుచానూరులో పుణ్యసాన్నాలు ఆచరించేందుకు పుష్కరిణి భక్తులకు అందుబాటులోకి వచ్చింది. తిరుమల తరహాలో అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు పుణ్యస్నానాలు చేసేందుకు రూ.9కోట్ల వ్యయంతో అమ్మవారి పుష్కరిణిని ఆధునికీకరించారు. పుష్కరిణిలో భక్తులు పుణ్యసాన్నాలు చేసేందుకు తెలుగుగంగ నీటికి అనుమతించారు. భద్రతాపరమైన చర్యలు తీసుకుని బుధవారం నుంచి పుష్కరిణిలోకి అనుమతించారు.డిప్యూటీ ఈవో గోవిందరాజన్ ఆధ్వర్యంలో పుష్కరణి వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులను అనుమతించారు. దుస్తులు మార్చుకునేందుకు రేకుల షెడ్డును రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు భక్తులు పుణ్యస్నానాలు ఆచరించవచ్చన్నారు.నాల్గవ గేటు గుండా భక్తులు పుష్కరిణిలో స్నానాలు ఆచరించి దర్శనానికి వెళ్లవచ్చన్నారు. గత నవంబరులో అమ్మవారి బ్రహ్మోత్సవాలకు పుష్కరిణి పనులు పూర్తయినా చిన్నపిల్లల భద్రతా చర్యల కోసం గురువారం నుంచి అనుమతించారు.



పుష్కరిణిలో అర్చకుల పూజలు



వైసీపీ కార్యాలయంలో జరిగిన యాగంలో రిషబ్‌శెట్టికి వేద పండితుల ఆశీర్వాదం

## శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుదర్శన యాగంలో రిషబ్‌శెట్టి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: ఎన్నికల్లో మరోసారి గెలవాలని కోరుకుంటూ తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి గురువారం సుదర్శన యాగం నిర్వహించారు.శ్రీకాళహస్తి వైసీపీ కార్యాలయంలో జరిగిన ఈ హోమానికి కన్నడ నటుడు,కాంతర ఫేం రిషబ్ శెట్టి హాజరయ్యారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన ఆయన దర్శనానంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఫోటోలు మీడియాకు పంపడంతో యాగం విషయం వెలుగులోకి వచ్చింది.

## నేడు ఉపాధి సామాజిక బహిరంగ సభ

రామచంద్రాపురం, ఫిబ్రవరి 29: మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ సామాజిక బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసలు తెలిపారు. 2023-24కు సంబంధించి 24 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం 18 రోజుల పాటు పరిశీలించిందని తెలియ జేశారు. లోపాలను బహిరంగ సభలో వెల్లడించనున్నారని పేర్కొన్నారు. ఈ సభకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసలు, ఉపాధి కూలీలు హాజరు కావాలని ఆయన కోరారు.

## మూషిక వాహనంపై వాల్మీకేశ్వరుడి వైభోగం

నాగలాపురం, ఫిబ్రవరి 29: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో గురువారం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ స్థానిక గ్రామదేవత పొన్నియమ్మకు పంచామృతాలతో అభిషేకాలు చేసి ధీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మ వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మంగళవాయిద్యాల నడుమ మహా హారతి సమర్పించారు. అనంతరం తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు పూజలు చేశారు. మధ్యాహ్నం రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వాల్మీకేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో, పట్టు వస్త్రాలతో, బంగారు ఆభరణాలతో, దివ్యాంగ సుందరంగా ముస్తాబు చేసి మహా హారతి చేపట్టారు. అనంతరం మంగళ వాయిద్యాలు, బాణసంచా వెలగుల నడుమ స్వామి వారిని మూషిక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజలకు సురుటుపల్లి గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ పూజలను ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, ఈవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా నేడు శుక్రవారం పల్లకి వాహన సేవ జరగనుంది.





గ్రామదేవత పొన్నియమ్మ పూజలు చేస్తున్న అర్చకులు, మూషిక వాహనంపై వాల్మీకేశ్వర స్వామి

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 29: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2018 నుంచి భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. వారికోసం వచ్చిన కోట్లాది రూపాయలను సీఎం జగన్ దారి మళ్లించి సంక్షేమ పథకాలకు వాడారన్నారు. జీవో నెంబరు 17ని రద్దు చేసి, భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, చిన్నం పెంచులయ్య, శివ, మణి, బాబు, రవి, చంద్రబాబు, శ్రీనివాసులు, వీరయ్య, బుల్లెట్ వెంకటేష్, తిరుమలయ్య, కేశవ, అర్జున్, బాలాజీ, హరి, ఏసు, పద్మనాభరెడ్డి ప్రమీల పాల్గొన్నారు.

## రిటైర్డ్ పోలీసు అధికారులకు సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులతో ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 29: తిరుపతి జిల్లాకు చెందిన ఐదుగురు పోలీసు అధికారులు గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఎస్పీ మలిక గర్గ్ వారిని ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. స్థానిక పోలీస్ అతిథి భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ వై.బాలకృష్ణ, ఎస్ఐ వీవీ సుబ్బానాయుడు, ఏఎస్ఐ ఎస్.ఆనంద్, ఏఆర్ ఎస్ఐ జి.నాగేశ్వర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ పీవీ వెంకటేశ్వరరావును ఎస్పీ సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలతో కుటుంబాలను సైతం పట్టించుకోకుండా పనిచేశారని, ఇకపై కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సంతోషంగా గడపాలని సూచించారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, ఏవో కిషోర్‌కుమార్, ఎస్పీ డీఎస్పీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎన్నికలు సవ్యంగా జరిగేలా ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నిశాంత్‌రెడ్డి

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 29 : చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ఎన్నికలు సవ్యంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీవో, ఈఆర్వో నిశాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం నియోజకవర్గ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ప్రధానంగా పోలింగ్‌స్టేషన్ పేరు, సవరణలు, లొకేషన్ మార్పులు, అనుబంధ స్టేషన్ల ఏర్పాటు తదితర వాటిపై చర్చించారు. నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలపై టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తి నాని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు.

## టీడీపీ, జనసేన కూటమికి బీసీ సంఘం మద్దతు



మాట్లాడుతున్న రాజేశ్వర్‌యాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 29: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి మద్దతు తెలుపుతామని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీడీపీ స్థాపన నుంచి రాష్ట్రంలోని వెనుకబడిన కులాలు మద్దతు తెలుపుతున్నాయన్నారు. టీడీపీతోనే బీసీలకు రాజకీయ గుర్తింపు లభించిందన్నారు. జగన్ అన్యాయం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజయ్య, మనోహర్ ఆచారి, జగన్నాథం ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## ఎస్వీ హైస్కూల్‌కు ఐఎస్ఎంఏ అవార్డు



తిరుమల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఎస్వీ హైస్కూల్‌కు ఐఎస్ఎంఏ అవార్డు లభించింది. ఎన్ఎంఎంఎస్ పరీక్ష, ఒలంపియాడ్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్స్ సైన్స్ పరీక్ష, డ్రాయింగ్‌లో ఎస్వీ హైస్కూల్ బహుమతులు సాధించిన నేపథ్యంలో ఐఎస్ఎంఏ అవార్డు ప్రదానం చేశారు. ఆధ్యాత్మిక విద్యా విధానంలో దేశంలోనే మొదటి ర్యాంకును ఎస్వీ ఎలిమెంటరీ స్కూల్ పొందింది. ఈ అవార్డులను ఎస్వీ హైస్కూల్ దత్తత తీసుకున్న సింఘానియా ఎడ్యుకేషన్ ప్రతినిధి గాయత్రి ఈవో ధర్మారెడ్డికి గురువారం చూపించారు.

## ఐక్యతతో హక్కులు సాధించుకుందాం



సమావేశంలో వన్నెరెడ్డి సమన్వయ సేవా సంఘం ప్రతినిధులు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 29: ఐక్యతతో హక్కులు సాధించుకుందామని వన్నెరెడ్డి సమన్వయ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు కోరారు. గురువారం సాయంత్రం యూత్‌హాస్టల్ ప్రాంగణంలో వన్నెరెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. హక్కులతోపాటు గౌరవప్రదమైన పదవులు దక్కించుకుందామని కోరారు. తిరుపతిలో ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించే స్థాయిలో తమ ఓటర్లు ఉన్నారని తెలిపారు. తమకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీకే మద్దతు ఇస్తామని చెప్పారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, వన్నెరెడ్డి సమన్వయ సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మునిరామిరెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోబాకు ధనంజయరెడ్డి, బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, జానకిరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సస్యరక్షణ పద్ధతులతో మామిడిలో నాణ్యమైన దిగుబడి

పాకాల, ఫిబ్రవరి29: మామిడి తోటల్లో సస్యరక్షణ పద్ధతులు పాటించి నాణ్యమైన, అధిక దిగుబడి సాధించాలని ఆత్మ డీపీడీ రత్నప్రసాద్ కోరారు. మండలంలోని ఇరంగారిపల్లెలో గురువారం మామిడి రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్తలు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఆత్మ డీపీడీ మాట్లాడుతూ వాతావరణంలో కలిగిన మార్పులతో మామిడి తోటలో పూత ఆలస్యమయిందన్నారు. మామిడి పూత, పిందెలు రాలకుండా, పురుగులు తెగుళ్ల ఆశించకుండా చేపట్టాల్సిన సస్యరక్షణ గురించి కేవీకే శాస్త్రవేత్త సుధాకర్ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారిణి శైలజ, వ్యవసాయాధికారి పుష్పావతి, ఏఈవోలు రమేష్, అమీర్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

## గోవిందరాజస్వామి ఆలయంలో అన్నదానం ప్రారంభం



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 29: గోవిందరాజస్వామి ఆలయంలో భక్తులకు నిత్యాన్నదాన పథకాన్ని టీటీడీ గురువారం ప్రారంభించింది. ఉత్తరమాడవీధిలోని పాత మ్యూజి యం ఆవరణలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి ఈ కార్యక్రమానికి లాంచనంగా శ్రీకారం చుట్టారు. భక్తులకు అన్నం వడ్డించిన అనంతరం భూమన మాట్లాడుతూ తిరుమలలో రోజూ లక్షమంది భక్తులకు టీటీడీ అన్నప్రసాదం అందిస్తోందన్నారు. అలాగే తిరుచానూరు అమ్మవారి ఆలయాన్ని సందర్శించే భక్తులకు నిత్యాన్నదాన పథకం ద్వారా అన్నప్రసాదం అందిస్తున్నామన్నారు. ఇటీవలే ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలోనూ ప్రారంభించామన్నారు. ఇదే రీతిలో గోవిందరాజస్వామి ఆలయానికి వచ్చే భక్తుల కోసం అమలు చేస్తున్నామని తెలిపారు. గోవిందరాజస్వామి ఆలయం వద్ద ప్రతిరోజూ ఉదయం 11నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు వేల మందికి నిత్యాన్నదానం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జియ్యర్, చిన్నజీయ్యర్, జేఈవో వీరబ్రహ్మం, సీపీఆర్వో టి.రవి, డిప్యూటి ఈవో శాంతి పాల్గొన్నారు.

## రఘునాథ్ సేవలు గణనీయమైనవి



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 29: టీటీడీ అన్నమాచార్య ప్రాజక్టు కళాకారుడిగా గాత్ర కళాకారుడు బొమ్మిశెట్టి రఘునాథ్ సేవలు ఎనలేనివని పలువురు ప్రశంసించారు. గురువారం రఘునాథ్ ఉద్యోగ విరమణ సభ అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించారు. ఎస్వీ సంగీత కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ అధ్యక్షత వహించారు. సహస్రావధాని మేడసాని మోహన్, గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, అన్నమాచార్య ప్రాజక్టు సంచాలకులు ఆకెళ్ల విభీషణ శర్మ, పూర్వ సంచాలకులు మునిరత్నం రెడ్డి, ఆచార్య దక్షిణామూర్తి శర్మ, నిఘా అధికారి బాలిరెడ్డి, చిన్నంగారి రమణ, ప్రాజక్టు కళాకారులు ఆనందభట్టర్, మధుసూదన రాము, పరిమళరమేష్, నాయకులు వెంకటేష్, కందారపు మురళి, బీజేపీ నేత గుండాల గోపినాథ్‌రెడ్డి హాజరై రఘునాథ్ దంపతులను సత్కరించారు. అన్నమయ్య కీర్తనల వ్యాప్తిలో ఆయన కృషిని అభినందించారు.

## డయాబెటిక్ రోగుల్లో రెటినోపతికి అవకాశం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుధారాణి

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 29 : డయాబెటిక్ బాధితులు కంటిచూపు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండా లని, లేకపోతే రెటినోపతి అనే కంటి వ్యాధి వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ సుధారాణి అన్నారు. తిలక్‌రోడ్డులోని శ్రీసాయి సుధా కంటి ఆస్పత్రిలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దృష్టి లోపంతో బాధపడే వారికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ప్రారంభ దశలో గుర్తిస్తే రెటినోపతి వ్యాధి బారిన పడకుండా చూడవచ్చన్నారు. డయాబెటిక్ బాధితులు మూడు నెలలకొకసారి కంటి స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

## వైసీపీతోనే వన్నెరెడ్ల అభ్యున్నతి : సిపాయి

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 29 : వైసీపీ పాలనలోనే వన్నెరెడ్లకు అభివృద్ధి ఉంటుందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు ఎమ్మెల్సీ కార్యాలయంలో రేణిగుంట మండల కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. సీఎం జగన్ వన్నెరెడ్లను అన్ని విధాలా ప్రోత్సహిస్తు న్నారని తెలిపారు. జడ్పీటీసీలు సంధ్య, సుబ్రహ్మణ్యంరెడ్డి, సర్పంచులు సురేష్, శివయ్య, గుంగయ్య, మల్లికార్జున్, గంగాధరం, మునిరత్నంరెడ్డి, గుణ, గురవారెడ్డి, రత్నంరెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## పద్మావతి వర్సిటీలో యూఎస్ కాన్సులేట్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 29: పద్మావతి మహిళా యూనివర్సిటీని యూఎస్ కాన్సులేట్ నౌషీన్ ఆలీ గురువారం సందర్శించారు. యూఎస్ఏలో విద్యా, ఉపాధి అవకాశాలకు సంబంధించిన విషయమై వీసీ ప్రొఫెసర్ భారతితో ఆమె చర్చించారు. అవగాహనా ఒప్పందాలు చేసుకుని పరస్పరం బోధన, పరిశోధన రంగాల్లో సహకరించుకుంటామని వీసీ భారతి, నౌషీర్ ఆలీ పేర్కొన్నారు. రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి29(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 66,915 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,784 మంది తలనీలాలు సమర్పించారు. కాగా, ఎంపీ ప్రఫుల్ పటేల్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

## పరిశ్రమలకు బదులు మద్యం బ్రాండ్లు తెచ్చారు

జగన్‌పై తెలుగు యువత ధ్వజం




మద్యం బాటిళ్లను ప్రదర్శిస్తున్న తెలుగు యువత నేతలు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 29: సీఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి భారీ పరిశ్రమలు, పెట్టుబడులు తెస్తానని చెప్పారని, ప్రస్తుతం వాటికి బదులు మద్యం బ్రాండ్లను తెచ్చారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు ఎద్దేవా చేశారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత గంజాయికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. కార్మికులు, రోజువారీ కూలీలు నాసిరకం మద్యం తాగి ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. మంత్రులు గుడివాడ అమరనాథ్, రోజా రాష్ట్రానికి భారీ పరిశ్రమలు తెచ్చామని అంటుంటే ప్రజలు నవ్వుతున్నారన్నారు. సిద్ధం సభలకు పాఠశాలల బస్సులను వాడుకోవడం వంచిదికాదన్నారు. 2.25లక్షల ప్రభుత్వ పోస్టులను భర్తీ చేస్తానని చెప్పిన జగన్ ఒక్కటంటే ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని తెలిపారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. టీడీపీ జనసేన కూటమిని ఆదరిస్తే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హిమవంత్, సందీప్, వాసు, రంజిత్, లోకేష్, సంతోష్, గోపి, శివ, రవి, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ, జనసేన కూటమిని ఆదరించండి



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 29 : టీడీపీ, జనసేన కూటమిని ఆదరించాలని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మతో కలిసి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమిని ఆదరించాలన్నారు. తాడేపల్లిగూడెం సభతో వైసీపీకి వణుకు పుట్టిందన్నారు. ప్రతిపక్షాలను టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయించాలని చూస్తే పతనం తప్పదన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు వన్‌సైడ్ జరగబోతున్నాయని, 135 నుంచి 145 వరకు టీడీపీ, జనసేన కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణం తిరుపతికే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నగరాల్లో జరిగాయని ఆరోపించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు శ్రీధర్‌వర్మ, భాస్కర్‌యాదవ్, మహేష్‌యాదవ్, మనోహర్ ఆచారి, రాజయ్య, సందీప్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు స్టేపై హర్షం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 29: ఎస్వీయూలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంపై హైకోర్టు స్టే ఇవ్వడం పట్ల లా, ఎకనమిక్స్ స్కాలర్లు కె.పవన్‌కల్యాణ్, అశోక్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏ ప్రభుత్వమైనా యూనివర్సిటీ భద్రతకు ఆటంకం కల్గించే ఇలాంటి చర్యలకు దిగితే తప్పక న్యాయ పోరాటం చేస్తామని వారు పేర్కొన్నారు. హైకోర్టు స్టే విధించడం పట్ల యూనివర్సిటీ విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, పూర్వ విద్యార్థులు సంతోషంగా ఉన్నారని వారు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## టీడీపీకి అశోకరాజు రాజీనామా



తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 29: టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, సిద్ధార్థ ఇంజనీరింగు కళాశాలల ఛైర్మన్ అశోకరాజు ప్రకటించారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సుదీర్ఘకాలం పార్టీలో తనను ఆదరించి అవకాశం కల్పించినందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే తన భవిష్యత్తు కార్యాచరణను చెబుతానన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల దీక్ష వాయిదా

తిరుపతి (కొర్లగుంట), ఫిబ్రవరి 29: ఆర్టీసీ ఉద్యోగుల నిరవధిక నిరాహారదీక్షను వాయిదా వేస్తున్నట్లు ది పి.టి.డి.వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తిరుపతి డిపో కార్యదర్శి రాంబాబు తెలిపారు. తమ సమస్యలకు పరిష్కారం లభించలేదని శుక్రవారం నుంచి దీక్షకు దిగాలని నిర్ణయించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ వారితో చర్చలు జరిపారు. ప్రజారవాణాధికారి, డిప్యూటీ సీటీఎం, అధికారుల ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వాయిదా వేసినట్లు రాంబాబు వివరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు అర్జునయ్య, పరందామయ్య, రమణ, చలపతి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బాలికల హైస్కూల్‌ను సందర్శించిన ఐబీ బృందం



ఐబీ కరిక్యులమ్ ప్రతినిధులతో డీఈవో శేఖర్, ఇతర అధికారులు - ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థులతో ఐబీప్రతినిధులు, టీచర్లు

తిరుపతి(విద్య),ఫిబ్రవరి29:చిన్నబజారు వీధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను గురువారం ఇంటర్నేషనల్‌బాకలారియట్(ఐబీ)కరిక్యులమ్ రూపకల్పన బృంద సభ్యులు సందర్శించారు. అమెరికాకు చెందిన వెండీగీన్(సీనియర్ మేనేజర్), ఇంగ్లండ్‌కి చెందిన ఎరిక్‌బాబర్(పర్సనల్ డెవలప్‌మెంట్ ప్రత్యేకాధికారి) సందర్శించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావిధానం, బోధనా పద్ధతులు బాగున్నాయని పేర్కొన్నారు. పాఠశాలలో అమలు చేసే కరిక్యులమ్, ద్విభాషా పాఠ్య పుస్తకాలు, డిజిటల్ విద్య, మౌలిక వసతులు వంటివి బేష్‌గా ఉన్నాయని అభినందించారు. టీచర్ల బోధనా విధానం, విద్యార్థుల అభ్యసనలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీ) ఏవిధంగా దోహదపడుతున్నాయన్నది పరిశీలించారు.సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ, యూనిఫాం,పాఠశాలప్రాంగణంలో పరిశుభ్రతవంటి అంశాలను పరిశీలించి అభినందించారు.డీఈవో శేఖర్ మాట్లాడుతూ జిల్లాలో పలు పాఠశాలలను సందర్శించిన బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ఐబీకరిక్యులమ్ ఏపీ కోఆర్డినేటర్, ఎస్సీఈఆర్‌టీ ప్రొఫెసర్ వై.గిరిబాబుయాదవ్ మాట్లాడుతూ గణితం, సైన్స్, ఆంగ్ల సబ్జెక్టుల్లో విద్యార్థుల స్థాయిని అంచనా వేశారని వివరించారు.ఎంఈవో బాలాజి, హెచ్‌ఎం వెంకటసుబ్బమ్మ,అసిస్టెంట్ ఏఎంవో వయ్యాల మధు, డీఈవో కార్యాలయ సీసీ కుమార్ పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్‌లో ముగిసిన టెక్నికల్ కార్నివాల్



బహుమతులు అందిస్తున్న జనరల్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్వీగౌరీశంకర్, అధ్యాపకులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 29 : కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు నిర్వహించిన టెక్నికల్ కార్నివాల్ గురువారంతో ముగిసింది. 8 బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు 40కిపైగా ప్రాజెక్టులను రూపొందించి ఎగ్జిబిట్ చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. చంద్రగిరి, పిళ్లారి పట్టు పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన అధ్యాపకులు డాక్టర్ టి.నరసింహారెడ్డి, ఎం.రాఘవేంద్ర న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కంప్యూటర్స్ విభాగంలో హాస్పిటల్ డయాగ్నోస్టిక్స్ ప్రాజెక్ట్ ప్రథమ స్థానంలో నిలవగా.. ఇదే విభాగానికి చెందిన సర్వీస్‌హబ్ ద్వితీయస్థానం, ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు రూపొందించిన క్లీన్ అండ్ గ్రీన్ ఎలక్ట్రిసిటీ ప్రాజెక్ట్ మూడవ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు 1995-98బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు నగదు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులను ఇన్నోవేషన్ హబ్ కోఆర్డినేటర్, జనరల్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ పి.రాజమోహన్‌రెడ్డి అభినందించారు.

## ఎస్టీయూ నేత ధనంజయలుకు అభినందన



ధనంజయలునాయుడును అభినందిస్తున్న ఎస్టీయూ నాయకులు మునికృష్ణనాయుడు, మురళీకృష్ణ

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 29 : రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీయూ) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తిరుపతి ఎస్జీకాలనీ నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం కె.ధనంజయులునాయుడిని గురువారం పలువురు టీచర్లు, సంఘ నాయకులు అభినందించారు. ఆయన్ను దుశ్శాలు వా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ధనంజయులనాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ పక్షాన నిరంతరం కృషి చేస్తానని, 35సంవత్సరాలుగా సంఘానికి చేసిన సేవలకు గుర్తింపుగా రాష్ట్రస్థాయిలో అత్యున్నత పదవి దక్కడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. జిల్లా నాయకులు భీమినేని మునికృష్ణనాయుడు, జగ న్నాథం, మురళీకృష్ణ, రేణుకాదేవి, రమేష్‌నాయక్, శ్రీనివాసన్, మనోహర్, అనిల్‌కుమార్, జయప్రకాష్, టీచర్లు పాల్గొన్నారు.

## ఈ పదేళ్లలో దేశంలో అత్యద్భుత ఆవిష్కరణలు

### కేంద్ర రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి




సదస్సులో డాక్టర్ సతీష్‌రెడ్డి, వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 29: గడిచిన పదేళ్లలో దేశంలో ఎన్నో అత్యద్భుత ఆవిష్కరణలు జరిగాయని డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. అఖిల భారత శిక్షక్ మహాసంఘ్(ఏబీఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో ఆత్మ నిర్భర భారత్ - సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ రక్షణ రంగంలో పదేళ్లలో ఎన్నో గొప్ప పనులు జరిగాయన్నారు. ఆ రంగంలో జరిగిన పరిశోధనలు, ఆవిష్కరణలు ఇందుకు నిదర్శనమన్నారు. నూతన ఆయుధాల కొనుగోళ్లకు విదేశాలపై ఆధారపడటం చాలా వరకూ తగ్గిందన్నారు. తద్వారా రూ.వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకున్నామన్నారు. 2047 నాటికి దేశాన్ని విశ్వగురువుగా నిలిపే బాధ్యత యువతపై ఉందని గుర్తు చేశారు. యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు ఇందుకు అవసరమైన బాధ్యతను స్వీకరించాలని కోరారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ శతాబ్దం చివరికి శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగంలో మన దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ నేత లక్ష్మణ్ మాట్లాడారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వైపీ రామిరెడ్డి పాల్గొన్నారు.

## రాజకీయాల్లో వ్యక్తిత్వ హననం తగదు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 29 : రాజకీయాల్లో వ్యక్తిత్వ హననం తగదని వైసీపీ నేతలు అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వైసీపీ నాయకులు వెంకటేశ్వర్లు, గణేష్, సురేష్ మాట్లాడుతూ మూడవ వార్డులో ఎన్నికల్లో ఓటమి పాలయ్యారని అక్కసుతో కృష్ణయాదవ్ కులం పేరుతో దూషించడం తగదన్నారు. ఏదైనా ఉంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలే తప్పా వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వల్ల నగరంలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టిన వారవుతారని పేర్కొన్నారు.

## రేపు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమాన్ని శనివారం ఉదయం తిరుమలలో నిర్వహించనున్నారు. అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సలహాలు, సూచనలు, ఫిర్యాదులను ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకురావచ్చు. దీనికోసం 0877-22630261ను సంప్రదించాల్సి ఉంటుంది.

## సిద్ధం సభను విజయవంతం చేద్దాం

### ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 29 : ఒంగోలులో ఈనెల 10వ తేదీన జరిగే సిద్ధం సభను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం ఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సిద్ధం సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిద్ధం సభను పెద్దయెత్తున నిర్వహించేందుకు పార్టీ అధిష్ఠానం ఏర్పాట్లు చేస్తోందని, తిరుపతి నుంచి పెద్దసంఖ్యలో హాజరుకావాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాపరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణ, నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, కేతం జయచంద్రారెడ్డి, ఎస్కే బాబు, శ్రీదేవి పాల్గొన్నారు.

## డీడీఈ సైకాలజీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 29 : ఎస్వీయూ దూరవిద్యా సైకాలజీ మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితాలు విడుదలయ్యాయి. మన బడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఈ ఫలితాలు పొందుపర్చినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

## పులికాట్ పరిసరాల్లో మడ చెట్లు పెంచాలి



మడ అడవులపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 29: పులికాట్ సరస్సు పరిసరాల్లో మడ చెట్ల పెంపకం ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని డీఎఫ్‌వో శామ్యూల్ అన్నారు. గురువారం అట్టకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో వైజాగ్‌కు చెందిన అటవీ పరిశోధన, తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థా కేంద్రం (ఎఫ్‌ఆర్‌సీఈసీ) బృందం వారు అటవీశాఖ అధికారులు, సిబ్బందికి మడ అడవులపై అవగాహన కల్పించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ వాకాడు మండల కొండూరుపాలెం వద్ద మడచెట్ల పెంపకానికి ఎఫ్‌ఆర్‌సీఈసీ వారు ముందుకొచ్చారన్నారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి ప్రకాష్, రాజు, ఎఫ్‌ఆర్‌సీఈసీ సిబ్బంది శ్రీనివాస్, గణేష్, గాయిత్రి, అనూష, శ్రావణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా పోరుయాత్ర



గూడూరులో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 29: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడానికి ప్రజా పోరుయాత్ర నిర్వహిస్తున్నట్లు బీజేపీ పట్టణాధ్యక్షుడు అరికట్ల బాలకృష్ణమనాయుడు తెలిపారు. గురువారం రెండోప ట్టణ పరిధిలో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తమవిగా చెప్పుకుంటోందన్నారు. భైరప్ప, పనబాక కోటేశ్వరరావు, గాలి ప్రకాష్‌నాయుడు, గిరిధర్‌రెడ్డి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

**తడ:** మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాపోరుయాత్ర నిర్వహించారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి విజయభాస్కర్, మండల కన్వీనర్ రాచర్ల కృష్ణమూర్తి, నేతలు మధుసూదన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ టిక్కెట్ కేటాయించాలని దరఖాస్తు

గూడూరు, ఫిబ్రవరి 29: గూడూరు అసెంబ్లీకి లేదా తిరుపతి పార్లమెంటు కాంగ్రెస్ తరపున టిక్కెట్ కేటాయించాలని గురువారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసినట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యునైటెడ్ ఫోరం సంస్థ అధ్యక్షుడు రవిరాఘవేంద్ర తెలిపారు. తమ సంస్థ ద్వారా గూడూరు నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తోపాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలియజేసినట్లు వివరించారు.

## తాగునీటి సమస్య రాకుండా చూడాలి



సమావేశంలో ఎంపీపీ, అధికారులు

గూడూరు, ఫిబ్రవరి 29: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ గురవయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పలు సమస్యలపై చర్చించారు. జడ్పీటీసీ సభ్యురాలు యామిని, ఇన్‌చార్జి ఎంపీడీవో మురళి, ఇంద్రారాణి, ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి భూ సమస్య పరిష్కరించాలి



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న పవన్

బాలాయపల్లి, ఫిబ్రవరి 29: భైరవరం గ్రామానికి చెందిన కడిమి సుబ్బమ్మ అనే వృద్ధురాలి భూ సమస్యను పరిష్కరించాలని మార్పు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిగురుపాటి పవన్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కొనుగోలు చేసిన భూమికి పాసుపుస్తకాలు మంజూరు చేయాలని సుబ్బమ్మ 30 ఏళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆరోపించారు. ఇకనైనా ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఆయనవెంట బాధితురాలు సుబ్బమ్మ ఉన్నారు.

## పదవీ విరమణ సన్మానం



గిరినాథ్, రవీంద్రకుమార్‌లను అభినందిస్తున్న అధికారులు

గూడూరు, ఫిబ్రవరి 29: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయడం ద్వారా ప్రజల నుంచి గుర్తింపు పొందుతారని డీపీఆర్ ఈవో శంకరనారాయణ అన్నారు. గురువారం డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో పంచాయతీరాజ్‌శాఖ ఈఈగా గిరినాథ్, డీఈగా రవీంద్రకుమార్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వీరిద్దరూ పీఆర్‌శాఖలో మంచిపేరు తెచ్చుకున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో సుభాష్‌బాబు, శివారెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రవికుమార్, షౌకత్‌హుస్సేన్, చంద్రశేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

## లైన్‌మ్యాన్‌పై దాడి

తడ, ఫిబ్రవరి 29: కరెంట్ బిల్లు కట్టలేదని అడిగినందుకు లైన్‌మ్యాన్‌పై ఓ వ్యక్తి దాడిచేశాడు. పన్నంగాడుకు చెందిన పూజారి ఆర్ముగం రెండు నెలలుగా విద్యుత్ బిల్లు చెల్లించలేదు. దీనిపై ఆయన ఇంటికి లైన్‌మ్యాన్ డి.ప్రభాకర్ గురువారం వెళ్లి.. బిల్లు విషయమై అడిగాడు. సరైన సమాధానం రాకపోవడంతో కనెక్షన్ కట్‌చేశాడు. కోపోద్రిక్తుడైన ఆర్ముగం ఆ లైన్‌మ్యాన్‌పై దాడి చేశాడు. ఈ విషయాన్ని ఏఈ మురళికి తెలియజేసి, ఆయన సమక్షంలో పోలీసులకు లైన్‌మ్యాన్ ఫిర్యాదు చేశారు.

## శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుదర్శన యాగంలో రిషబ్‌శెట్టి



వైసీపీ కార్యాలయంలో జరిగిన యాగంలో రిషబ్‌శెట్టికి వేద పండితుల ఆశీర్వాదం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: ఎన్నికల్లో మరోసారి గెలవాలని కోరుకుంటూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపుమధుసూదనరెడ్డి గురువారంసుదర్శన యాగం నిర్వహించారు. శ్రీకాళహస్తి వైసీపీ కార్యాలయంలో జరిగిన ఈ హోమానికి కన్నడ నటుడు,కాంతర ఫేం రిషబ్ శెట్టి హాజరయ్యారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన ఆయన దర్శనానంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఫోటోలు మీడియాకు పంపడంతో యాగం విషయం వెలుగులోకి వచ్చింది.

## ఆప్‌తోనే సంక్షేమం

నాయుడుపేట, ఫిబ్రవరి 29 : ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్)తోనే సంక్షేమం, అభివృద్ధి లభిస్తుందని జిల్లా ఉపాధ్యక్షుడు పాలేటి వెంకటస్వామి అన్నారు. నాయుడుపేటలో గురువారం ప్రజాచైతన్యయాత్రలో భాగంగా ప్రచారం చేపట్టారు. సూళ్లూరుపేట నియోజకవర్గ మహిళా కన్వీనర్ పులి మానస, మోహన్‌రాజు, రాజేష్, మానసా, రమణ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు

## సూళ్లూరుపేట/వెంకటగిరి

## వైసీపీని సాగనంపుదాం: జనసేన



ఎగిలాంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు

బాలాయపల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని పిగిలాం గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ, జనంలోకి జనసేన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పగడాల వెంకటరమణయ్య, పోలేపల్లి శ్రీనివాసులు, పోలేపల్లి కృష్ణ, ప్రసన్నకుమార్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సన్మానం

బాలాయపల్లి, ఫిబ్రవరి 29: జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న దండు రవీంద్రారెడ్డి గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉపాధ్యాయులు, స్థానికులు సన్మానించారు.

# టీడీపీ శ్రేణుల్లో జోష్

### వైసీపీ నుంచి చేరికలు పెరుగుతుండటమే కారణం

గూడూరు, ఫిబ్రవరి 29: గూడూరు నియోజకవర్గ పరిధిలో వైసీపీ నుంచి తమ పార్టీలోకి చేరికలు పెరుగుతుండటంతో టీడీపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. నియోజకవర్గంలోని ఎక్కువగా ఉండే రెడ్డి సామాజిక వర్గమూ ప్రస్తుతం టీడీపీ వైపే చూస్తోంది. ఎందుకంటే నెల్లూరుకు చెందిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వీపీఆర్) శనివారం నెల్లూరులో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు తెలిసింది. దాంతో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన రెడ్డి సామాజిక ప్రధాన నాయకులు వీపీఆర్‌ని కలిసి మంతనాలు సాగించి ఆయనతోపాటు టీడీపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే కోట మండలం దొరువుకట్ట గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు దశరథరామిరెడ్డి వీపీఆర్‌తోపాటే టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు. గూడూరు మండలం చెన్నూరుకు చెందిన ఏఎంసీ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, వైసీపీ ప్రధాన నాయకులు శ్రీనివాసులురెడ్డి, మురళీరెడ్డి తదితరులు కూడా వీపీఆర్ సమక్షంలోనే టీడీపీలో చేరనున్నారు. గురువారం గూడూరుకు చెందిన వైసీపీ రాష్ట్ర నాయకుడు కనుమూరు హరిచంద్రారెడ్డి నెల్లూరులో వీపీఆర్‌ని కలిశారు. ఈయన కూడా టీడీపీలో చేరనున్నట్లు సమాచారం. చిల్లకూరు, వాకాడు మండలాల నుంచి కూడా పలువురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ప్రధాన నాయకులు టీడీపీలోకి చేరనున్నారు. వీరి రాకతో తమకు మరింత పట్టు పెరుగుతుందని టీడీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

## టీడీపీవైపే అందరి చూపు: పాశం



పాశం సునీల్‌కుమార్‌తో చెన్నూరు వైసీపీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 29: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి పలువురు వైసీపీకి రాజీనామాలు చేసి తమ పార్టీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం చెన్నూరు గ్రామంలో వైసీపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఏఎంపీ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ వైసీపీ కార్యదర్శి శ్రీకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పార్లమెంట్ సేవాదళ్ కార్యదర్శి మురళీరెడ్డితోపాటు సుధాకర్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రవీంద్రరెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి తదితరులు వైసీపీకి రాజీనామాలు చేశారన్నారు. త్వరలోనే వీరంతా టీడీపీలోకి చేరుతారన్నారు. ఈ సమావేశంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం మురళీ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, గూడూరు టీడీపీ కార్యాలయంలో రెండో పట్టణానికి చెందిన పలువురు యువత పార్టీలో చేరారు. వీరికి పాశం.. టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అబ్దుల్‌రహీం, సురేష్, నాని, మహేష్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, చంద్రమౌళి, అమరయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### శంఖారావాన్ని విజయవంతం చేయాలి

నియోజకవర్గ పరిధిలో మార్చి ఏడో తేదీన నారా లోకేశ్ ఆధ్వర్యంలో జరగనున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, పురుషోత్తంరెడ్డి, గణపర్తి కిషోర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా పనిచేయండి

### టీడీపీ అభ్యర్థి పరిచయ సభలో నెలవల

పెళ్లకూరు, ఫిబ్రవరి 29: టీడీపీ విజయమే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు పనిచేయాలని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. సూళ్లూరుపేట టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా నెలవల విజయశ్రీ ఎంపికయ్యాక తొలిసారిగా కొత్తూరు టీడీపీ కార్యాలయంలో పరిచయ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా నాయుడుపేట-పెళ్లకూరు సరిహద్దు ప్రాంతమైన గోమతి సెంటర్ నుంచి కొత్తూరు వరకు 14 కిలోమీటర్లు 71వ జాతీయ రహదారిపై బైకుల ర్యాలీ నిర్వహించారు. కొత్తూరు టీడీపీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో నెలవల మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు ఎంతో కీలకమని చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించాలని సూచించారు. నాయుడుపేట మాజీ ఏఎంసీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎనికల్లో విజయశ్రీకి భారీ మెజారిటీ తీసుకురావాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, రాష్ట్ర, జిల్లా సర్పంచుల సంఘం నాయకులు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, కందమూడి శివకుమార్, నాయకులు నెలవల రాజేష్, గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, దార్ల రాజేంద్ర, దామెర ప్రసాద్‌నాయుడు, రామకృష్ణ, నరేంద్రయాదవ్, సిద్దులయ్య, వాసు, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయం వద్ద నాయకులతో నెలవల, విజయశ్రీ

### పార్టీ విజయానికి కృషి చేయండి

**నాయుడుపేట టౌన్:** టీడీపీ విజయానికి కృషి చేయాలని సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి విజయశ్రీ సూచించారు. మడఫలం గ్రామంలో గురువారం సాయంత్రం టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి అశోక్‌రెడ్డి తోపాటు గ్రామస్తులను ఆమె సన్మానించారు. టీడీపీ నాయకులు దార్ల రాజేంద్ర, సుజాతమ్మ, నెలవల రాజేష్, పార్థసారథి, తదితరులున్నారు.

## రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్

### ఏ మొహం పెట్టుకుని ప్రజల్ని ఓట్లు అడుగుతాడు: కురుగొండ్ల



మీడియాతో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఫిబ్రవరి 29: రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన సీఎం జగన్.. ఏ మొహం పెట్టుకుని ప్రజలను ఓట్లు అడుగుతాడని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రశ్నించారు. గురువారం తన నివాసంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ నేతల అరాచకాలు పెరిగిపోయాయని విమర్శించారు. శిశుపాలుడు వంద తప్పులు చేస్తే జగన్ వెయ్యొన్నొక్క తప్పు చేశారని అన్నారు. వైసీపీ నేతల వేధింపులు తట్టుకోలేక అంతర్ జాతీయ క్రికెట్ ప్లేయర్ హనుమ విహరి పారిపోయాడని చెప్పారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ సభకు వచ్చిన జనాన్ని చూసి తాడేపల్లి ప్యాలెస్ పునాదులు కదిలాయని తెలిపారు. పులివెందులలోనే జగన్ ఓడిపోబోతున్నారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేవీకే ప్రసాద్ నాయుడు, పులికొల్లు రాజేశ్వరరావు, గంగాధర్, పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యం, చంద్రారెడ్డి, చలపతి, మంకు ఆనంద్, మచ్చల వేణు, కూన శ్రీహరి, సుధ తదితరులు పాల్గొన్నారు.

## 3 కిలోల గంజాయి స్వాధీనం: ఒకరి అరెస్టు



నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయితో అధికారులు

వెంకటగిరి, ఫిబ్రవరి 29: మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వినయ్‌కుమార్ గురువారం మీడియాకు వివరాలు తెలిపారు. వెంకటగిరి ఆర్టీసీ బస్టాండులో తమిళనాడుకు చెందిన ఖాజా మొహిద్దీన్ షేక్ మన్సూర్ అనుమానాస్పదంగా కనిపించడంతో అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా అతడి వద్ద మూడు కిలోల గంజాయి బయటపడింది. దీన్ని రాజమండ్రికి చెందిన సతీష్ అనే వ్యక్తి వద్ద నుంచి కిలో రూ.3వేల వంతున కొనుగోలు చేసి, చెన్నైలో విక్రయించడానికి తీసుకెళుతున్నట్లు గుర్తించారు. దాంతో గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సిబ్బంది ఎస్ఐ మహబూబ్ వలి, సిబ్బంది రసూల్, వేణుగోపాల్, పుట్టయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఎస్‌కేఆర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు

గూడూరు, ఫిబ్రవరి 29: పట్టణంలోని ఐదు కేంద్రాల్లో శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్వర్ణాంధ్రభారతి, సెయింట్ మేరీస్, డీఆర్‌డబ్ల్యూ, నారాయణ జూనియర్ కళాశాలలో పరీక్షలు జరగనున్నాయి. ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు పరిశీలించారు.

**నాయుడుపేట:** ఎస్‌పీజీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 350 మంది, ఎల్‌ఏసాగరంలోని బాలుర గురుకులంలో 450 మంది, శ్రీవేమ కళాశాలలో 220 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరికోసం అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

### తల్లిదండ్రులకు పాదాభివందనం



పుదూరులో బాలికల పాఠశాల, కళాశాలలో విద్యార్థినులకు కన్నవారి దీవెన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ రూత్‌రమోలా నిర్వహించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానుండటంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అధ్యాపకులు పద్మజ, శశికళ, సునీత, విజయలక్ష్మి, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

### విద్యాసామగ్రి వితరణ

నాయుడుపేట, ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్న దృష్ట్యా జూనియర్ కాలేజీ హాస్టల్ విద్యార్థులకు అమ్మా చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బందిలమోహన్ విద్యాసామగ్రిని గురువారం వితరణ చేశారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు.

## పదేళ్లలో దేశంలో అత్యద్భుత ఆవిష్కరణలు / కేంద్ర రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి




సదస్సులో సతీష్‌రెడ్డి, వీసీ శ్రీకాంత్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 29: గడిచిన పదేళ్లలో దేశంలో ఎన్నో అత్యద్భుత ఆవిష్కరణలు జరిగాయని డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్ రెడ్డి పేర్కొన్నారు. అఖిల భారత శిక్షక్ మహా సంఘ్(ఏబీఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో ఆత్మ నిర్భర భారత్ - సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ రక్షణ రంగంలో పదేళ్లలో ఎన్నో గొప్ప పనులు జరిగాయన్నారు. ఆ రంగంలో జరిగిన పరిశోధనలు, ఆవిష్కరణలు ఇందుకు నిదర్శనమన్నారు. నూతన ఆయుధాల కొనుగోళ్లకు విదేశాలపై ఆధారపడటం చాలా వరకూ తగ్గిందన్నారు. తద్వారా రూ.వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకున్నామన్నారు. 2047 నాటికి దేశాన్ని విశ్వగురువుగా నిలిపే బాధ్యత యువతపై ఉందని గుర్తు చేశారు. యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు ఇందుకు అవసరమైన బాధ్యతను స్వీకరించాలని కోరారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ శతాబ్దం చివరికి శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగంలో మన దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ నేత లక్ష్మణ్ మాట్లాడారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి పాల్గొన్నారు.

## తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో అన్నదానం ప్రారంభం

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 29: గోవిందరాజస్వామి ఆలయంలో భక్తులకు నిత్యాన్నదాన పథకాన్ని టీటీడీ గురువారం ప్రారంభించింది. ఉత్తరమాడవీధిలోని పాత మ్యూజియం ఆవరణలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి ఈ కార్యక్రమానికి లాంఛనంగా శ్రీకారం చుట్టారు. గోవిందరాజస్వామి ఆలయం వద్ద ప్రతిరోజూ ఉదయం 11నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు వేల మందికి నిత్యాన్నదానం ఏర్పాటు చేశామన్నారు. తిరుమల పెద్ద జియ్యర్, చిన్నజియ్యర్, జేఈవో వీరబ్రహ్మం, సీపీఆర్వో టి.రవి, డిప్యూటి ఈవో శాంతి పాల్గొన్నారు.

# పుత్తూరు వార్తలు

## జనసేనలోకి రామసముద్రం యువత



వడమాలపేట, ఫిబ్రవరి 29: మండలంలోని రామసముద్రం గ్రామానికి చెందని యువకులు జనసేన సిద్ధాంతాలకు ఆకర్షతులయ్యారు. వడమాలపేటలో గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జి మహేష్ రామసముద్రం యువకులకు జనసేన కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. మహేష్, సుధాకర్, విష్ణు, ప్రశాంత్, మోహన్‌లతోపాటు 20 మంది యువకులు ఉన్నారు. జనసేన మండల అధ్యక్షుడు మునిశేఖర్, నాయకులు దేవ, చక్రవర్తి, కుమార్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ అండ్ టెక్నాలజీలో శరవేగంగా అభివృద్ధి



డాక్టర్ సతీష్ రెడ్డిని సన్మానిస్తున్న అశోక్ రాజు, కళాశాల బృందం

నారాయణవనం, ఫిబ్రవరి 29: భారతదేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి తెలిపారు. గురువారం సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో వికసిత్ భారత్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రస్తుతం 20 వేల పరిశ్రమలు డీఆర్‌డీవో కింద పని చేస్తున్నాయన్నారు. కళాశాల ఛైర్మన్ అశోక్‌రాజు మాట్లాడుతూ.. తమ విద్యార్థులు సైతం దేశ ప్రగతిలో పాలుపంచుకోవడానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. కళాశాల డైరెక్టర్ సుబ్బరాజు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి, జనార్ధన్‌రాజు, రమేష్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైసీపీ ఇక కనుమరుగే..! నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 29: సార్వత్రిక ఎన్నికల తర్వాత వైసీపీ కనుమరుగు కావడం ఖాయమని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేన సభ సూపర్ సక్సెస్ కావడం రానున్న ఎన్నికల్లో ప్రజాతీర్పును తెలియచేస్తోందని నొక్కి చెప్పారు. వైసీపీ అరాచకాలు ఉపాధి కల్పించే పరిశ్రమలకే కాదు.. చివరకు క్రీడలకు కూడా పాకిందని మండిపడ్డారు. అధికార పార్టీ నాయకులతో భరించలేక హనుమ విహారి వంటి వర్ధమాన క్రికెటర్ ఇకపై భవిష్యత్తులో ఆంధ్రా క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించనని చెప్పడం వారి దౌర్జన్యాలను తేటతెల్లం చేస్తోందని దుయ్యబట్టారు. చంద్రబాబు హయాంలో అన్న క్యాంటీన్ల ద్వారా ఐదు రూపాయలకే పేదవాడి కడుపు నింపితే వైసీపీ అధికారంలోకి వచ్చాక క్యాంటీన్లను రద్దు చేసి పేదవాడి కడుపుపై కొట్టాడని సీఎం జగన్‌పై విరుచుకుపడ్డారు. సుమారు 120 వరకు సంక్షేమ పథకాలను రద్దు చేసిన దుర్మార్గపు ప్రభుత్వం దేశ చరిత్రలో ఏదైనా ఉందంటే అది వైసీపీ ఒక్కటేనన్నారు. ఐదేళ్ల పాలనలో రాజధానితో సహా సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి రాష్ట్ర భవిష్యత్తును అంధకారం చేసిన జగన్‌ను ప్రజలు క్షమించరని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అభ్యర్థులు చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు.



టీడీపీలోకి పలువురి చేరిక

మున్సిపల్ పరిధిలోని 21వ వార్డు చెర్లోపల్లికి చెందిన లోకనాథరెడ్డి, గజేంద్ర, మునికృష్ణ, కుప్పయ్య, నరసింహులు, రాందాసు, నాగభూషణ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు గురువారం గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి భానుప్రకాష్ పార్టీ కండువాలు కప్పి టీడీపీకి ఆహ్వానించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆనంగి ఆనంద్, వార్డు అధ్యక్షుడు ఆనంగి రమేష్, చీరల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీకి అశోక్‌రాజు రాజీనామా

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 29: టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సిద్ధార్థ ఇంజనీరింగు కళాశాలల ఛైర్మన్ అశోక్‌రాజు ప్రకటించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సుదీర్ఘకాలం పార్టీలో తనను ఆదరించి అవకాశం కల్పించినందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే తన భవిష్యత్తు కార్యాచరణను చెబుతానన్నారు.

## లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ



నారాయణవనం, ఫిబ్రవరి 29: సొరకాయల స్వామి కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు గురువారం మెగా చెక్ పంపిణీ చేశారు. ఎంపీ గురుమూర్తి, సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, నాయకులు బీరేంద్ర, తహసీల్దార్, పంచాయితీ ఈవో, ఏపీఎం మమత, సీసీ నాగేంద్ర, ఏపీవో, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి29(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 66,915 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,784 మంది తలనీలాలు సమర్పించారు.

## రేపు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమాన్ని శనివారం ఉదయం తిరుమలలో నిర్వహించనున్నారు. అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సలహాలు, సూచనలు, ఫిర్యాదులను ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకురావచ్చు. దీనికోసం 0877-22630261ను సంప్రదించాల్సి ఉంటుంది.

# రెండో ఆర్టీసీ బస్టాండ్‌కు సహకరించండి


మిద్దెల హరిని సత్కరిస్తున్న మల్లిఖార్జున్ నాయుడు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: శ్రీకాళహస్తిలో రెండో బస్టాండ్‌కు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చేలా కృషి చేయాలని ఎంజీఎం గ్రూప్ ఛైర్మన్ గుడ్లూరు మలి ్లకార్జున్ నాయుడు కోరారు. గురువారం ఆయన ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అంద జేశారు. పట్టణానికి పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని శ్రీకాళహస్తికి తూర్పున ఉన్న 100 అడుగులు బైపాస్ రోడ్డుకి ఆనుకొని ఉన్న పది ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించాలని కోరారు. బస్టాండ్‌కు అనుమతి వస్తే అటు సత్యవేడు, సూళ్లూరు పేట, నాయుడుపేట, పిచ్చాటూరుకి ఆరులేన్ల రోడ్డు దగ్గరగా అందుబాటులో ఉండి శ్రీకాళహస్తి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వంతో చర్చించి మంజూరుకు ప్రయత్నిస్తానని ఈ సందర్భంగా మిద్దెల హరి తెలియజేశారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు.

# ముక్కంటి సేవలో కన్నడ నటుడు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: శ్రీకాళహస్తీశ్వరాల యానికి గురువారం కన్నడ నటుడు కాంతార ఫేం రిషబ్ శెట్టి విచ్చేశారు. కుటుంబసభ్యులతో విచ్చే సిన ఆయనకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో రాహుకేతు పూజల అనంతరం ఆయనకు వేదపండితులతే ఆశీర్వాదం, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వైసీపీ కార్యాలయంలో కుటుంబసభ్యులతో కలిసి ఆతిథ్యం పొందారు.

# ఐదుకోట్ల ఆంధ్రుల కోసమే కలయిక

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: తెలుగుదేశం, జనసేన కలయిక పార్టీల కోసం కాదని ఐదు కోట్ల ఆంధ్ర రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమని ప్రజలందరూ తెలుగుదేశం, జనసేన కూటమిని గెలిపించాలని కోరారు.

## ఏడుగురు జూదరుల అరెస్ట్

రేణిగుంట, ఫిబ్రవరి 29: మండలంలోని మల్లిమడుగు రిజర్వాయర్ సమీపంలో దొడ్లమిట్టకు చెందిన ఏడుగురు గురువారం పేకాట ఆడుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8,050 నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మల్లికార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

రేణిగుంట, ఫిబ్రవరి29: మండలంలోని వెంకటరెడ్డి కండ్రిగ గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అలాగే రేణిగుంట పంచాయితీ 5వ వార్డులో మరో సీసీ రోడ్డు పనులు మొదలు పెట్టారు. ఈ రోడ్డు పనులకు వైసీపీ మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రూ.20 లక్షలు వ్యయంతో ఈ రెండు పనులు ప్రారంభిం చామ న్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు సంధ్యారాణి, ఎంపీపీ హరి ప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, వైస్ ఎంపీపీ సుజాత, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ రసూల్, సర్పంచ్‌లు ఎస్.మునిశే ఖర్‌రెడ్డి, ఆర్.నగేషం, కో-ఆప్షన్ సభ్యులు అసన్‌సాహెబ్, నాయకులు పాల్గొన్నారు.

# కేంద్ర నిధులతో వైసీపీ ప్రభుత్వం షోకులు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 29: రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే వైసీపీ ప్రభుత్వం తమ స్టిక్కర్లను వేసుకుని షోకులు చేస్తోందని బీజేపీ తిరుపతి జిల్లా యువమోర్చా కార్యదర్శి ప్రజాపోరు కన్వీనర్ డిల్లీ రాయల్ ధ్వజమెత్తారు. గురువారం వరదయ్యపాళెంలో పోరుబాట కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పింఛన్లు, జీతాలు సకాలంలో చెల్లిం చలేని పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిసుబ్రహ్మణ్యం, వాసు, ఆనంద్‌నాయుడు, సత్య నారాయణ, వెంకటయ్య, యేసు, సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవోకు ఘన సన్మానం



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 29: ఉద్యోగ విరమణ పొందిన ఎంపీడీవో సుబ్రహ్మణ్య రాజును కార్యాలయ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. ఏవో అనసూయ, సీనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ, ఈవోపీఆర్డీ చిరంజీవి, ఈవో బసిరెడ్డి, భాగ్యరేఖ, హబీబ్, పద్మ నాభం, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది ముని, మధు, సురేష్, చైతన్య పాల్గొన్నారు.

# వలంటీర్లకు సన్మానం

ఏర్పేడు, ఫిబ్రవరి 29: ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గ్రామ వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి, వైసీపీ మండల ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రమణయ్యయాదవ్, ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీ శ్రీనివాసులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు భూమి పూజ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి భూమి పూజ చేశారు. ఇందులో భాగంగా గురువారం ముక్కంటి ఆలయ రాజగోపురం వద్ద ధూర్జటి కళా ప్రాంగణం సమీపంలో శిలాఫలకాలు ఆవిష్కరించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శ్రీకాళహస్తిని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన ఆశయమని చెప్పారు. స్వర్ణముఖి నది ఎడమవైపు కరకట్ట సుందరీకరణ, కనకాచలం ఆలయ విస్తరణ పనులు, శివం టు శివం రోడ్డు నిర్మాణం పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఏర్పేడు, ఫిబ్రవరి 29: గ్రామీణ ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ జిలానీ సూచించారు. గురువారం పరమాలపల్లి గ్రామంలో సివిల్ రైట్స్‌పై అవగాహన కల్పించారు. బాలరాజు, పద్మ దంపతులను ఇటీవల గ్రామస్తులు వెలివేసి గ్రామబహిష్కరణ చేయడంపై విచారణ చేపట్టారు. వెలివేయడం నేరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి మణి, మండల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బహిరంగ సభకు తరలిరండి


మాట్లాడుతున్న బత్తెయ్య నాయుడు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: తిరుపతిలో శుక్రవారం జరగబోయే షర్మిల బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్, వెంకటముని, శివయ్య, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# 30 పోలీస్ యాక్ట్ అమలు

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 29: శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో నెలరోజులపాటు 30 పోలీస్ యాక్ట్ అమలు చేయనున్నట్లు గురువారం డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి ప్రకటనలో వెల్లడించారు. ముందస్తు పోలీసుల అనుమతి లేకుండా సమావేశాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, ధర్నాలు చేయకూడదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# శ్రీకాళహస్తి
## సత్యవేడు

## విద్యుత్ షాక్‌తో
# భవన నిర్మాణ కూలీ మృతి

రేణిగుంట, ఫిబ్రవరి29: విద్యుత్ షాక్‌తో ఓ భవన నిర్మాణ కార్మికురాలు మృతిచెందింది. స్థానిక వినాయకనగ్‌లో ఓ భవన నిర్మాణ పనులు జరుగు తున్నాయి. స్వాతి అనే కూలీ పనులకు వెళ్లింది. గురువారం సాయంత్రం భవనం పైకి ఇనుప కమ్మీలను తీసుకెళుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై కింద పడిపోయింది. వెంటనే 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. మృతిచెందిన స్వాతి కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం రేణిగంట మండల కార్యదర్శి హరినాథ్ కోరారు.

## ముగిసిన ముక్కంటి పాలకమండలి కాలపరిమితి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి శుక్రవారంతో ముగిసింది. రెండేళ్ల కాల పరిమితితో ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేశారు. 2022 ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి ధర్మకర్తల మండలిని నియమస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మరుసటి రోజు మార్చి 1వ తేదీ మహాశివరాత్రి పర్వదినం రోజున ప్రమాణస్వీకారంతో మండలి కొలువు తీరింది. గురువారం రోజుతో నిబంధన ప్రకారం రెండేళ్ల కాల పరిమితి పూర్తి కావడంతో మండలి ముగిసింది.

## మెట్ల దారిలో షెల్టర్ లేపేశారు..!



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారుల తీరుపై ఎన్ని విమర్శలు, ఆరోపణలు వచ్చినా ఏమాత్రం పట్టించుకోరు. వీఐపీల కోసం అంటూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడవ ద్వారంగా ఉన్న తిరుమంజనం గోపురం మెట్లపై పలకలు పరచడం వివాదంగా మారింది. దీనిపై అభ్యంత రాలు వ్యక్తం అయ్యాయి. అయినా పట్టించుకోకుండా పలకలను ఏర్పాటు చేశారు. మెట్లపై ఉన్న నీడ కోసం ఉన్న షెల్టర్‌ను తీసేశారు. చెక్కతో ఏర్పాటు చేస్తున్న మెట్లు తాత్కాలికమని శివరాత్రి బ్రహ్మోత్సవాల తర్వాత వాటిని తొలగిస్తామని ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తెలిపారు.

## గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి స్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. స్వర్ణకవచాలంకృతంగా అలంక రించారు. వేదమంత్రాలతో ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

## ఉపాధి హామీ రికార్డుల తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు, ఫిబ్రవరి 29: ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డులను డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ గురువారం తనిఖీ చేపట్టారు. అముదూరు, పంగూరు సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు సంబధించి రికార్డులను తనిఖీ చేశారు. రైతులకు ఉచితంగా వివిధ రకాల చెట్లను ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. నేరేడు, మామిడి, జామ, తదితర చెట్లను తీసుకుని తోటల పెంపకం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దేవరి, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శోభకాదు... భక్తులకు క్షోభ


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: మహా శివరాత్రికి ఆధ్యాత్మిక శోభ సంగతి అటుంచితే వైసీపీ నాయకుల తీరుతో భక్తులు క్షోభ అనుభవించేలా ఉన్నారని టీడీపీ నాయకులు విమర్శించారు. గురువారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆపార్టీ నాయకులు మాట్లాడారు. తమ సొంత డప్పు కొట్టుకోవడం కోసం అధికార పార్టీ నాయకులు పట్టణంలో ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా బ్యానర్లను, ఫ్లెక్సీలను కట్టి ఆధ్యాత్మికతను మంట గలుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి తీరుతో పండగ కళ తప్పిందని శివభక్తులు క్షోభ పడేలా వ్యవహరించడం మంచిది కాదని హితవుపలికారు. ఉత్సవాల్లో శివ స్తుతి, శివ నామస్మరణ ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, పాలకులు వ్యక్తి పూజకు దాసోహం అనడం భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తోందన్నారు. ఉత్సవాల్లో ఆధ్యాత్మిక చింతనను దెబ్బతీసేలా ఉన్న రాజకీయ, రాజకీయేతర ఫ్లెక్సీలను, తోరణాలను వెంటనే తొలగించాలని కోరారు. అలాగే రావణవాహనం శిరస్సుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మిన్నల రవి, ఉమేష్ రావు, సుబ్బయ్య, బుజ్జి, మునిరాజయాదవ్, భాస్కర్, మణి, రామచంద్రయ్య, గణేష్, ఉదయ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

# సత్యవేడు సంక్షోభం సరిదిద్దండి!

## గురుమూర్తికి అప్పగించిన వైసీపీ అధిష్ఠానం

సత్యవేడు, ఫిబ్రవరి 29: అసంతృప్తితో రగిలి పోతున్న సత్యవేడు వైసీపీలో క్యాడర్‌ని చెక్క బెట్టేందుకు ఆ పార్టీ అధిష్ఠానం ఎంపీ గురుమూర్తిని రంగంలోకి దింపింది. తాను ఎంపీగా ప్రాతినిథ్యం వహిస్తున్న పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గంలో గత మూడేళ్లలో ఒకటిరెండు సార్లు మాత్రమే కనిపించిన గురుమూర్తి, ప్రస్తుతం సత్యవేడు నియోజకవర్గం చుట్టూ కాళ్లకు బలపం కట్టుకుని తిరుగుతున్నారు. సత్యవేడు వైసీపీ సమన్వయకర్తగా అధిష్ఠానం ప్రకటించిన నూకతోటి రాజేష్ అభ్యర్థిత్వాన్ని నియోజక వర్గంలో మెజారిటీ నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఎస్సీ సామాజిక వర్గం చెందిన పలువురు నేతలు స్థానిక నినాదను తెరపైకి తీసుకొచ్చి స్థానిక నేతలకే టికెట్ కేటాయించాలని అధిష్ఠానం వద్ద బలంగా తమ డిమాండ్‌ను వినిపిస్తూ వచ్చారు. అయితే ఇప్పటికే రెండు సార్లు అభ్యర్థులను మార్చిన అధిష్ఠానం మళ్లీ రాజేష్‌ను మార్చేందుకు ఒప్పుకోలేదు. దీంతో రాజేష్‌కు స్థానిక నాయకుల నుంచి సహాయ నిరాకరణ ప్రారంభమైనట్లు సమాచారం. దీంతో స్పందించిన వైసీపీ అధిష్ఠానం గురుమూర్తిని రంగంలోకి దింపినట్లు ఆ పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు. దీంతో వైసీపీ అభ్యర్థి రాజేష్‌కు తోడుగా ఆయన ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ రాజేష్ గెలుపునకు కృషిచేయాలని స్థానిక నేతలను అభ్యర్థిస్తూ తిరుగుతున్నారు. అయితే అధిష్ఠానం నిర్ణయాలతో అసంతృప్తితో ఉన్న కేడర్ ఈయన మాటలకు ఎంత వరకూ తలొగ్గుతుందో చూడాలి.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో మళ్లీ ప్రోటోకాల్ వివాదం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: శ్రీకాళహ స్తీశ్వరాల యంలో మళ్లీ ప్రోటో కాల్ వివాదం తెరమీదకు వచ్చింది. నిత్యం వివాదాల్లో ఉండే శ్రీకాళహస్తీశ్వ ర స్వామి దేవస్థానం వారు మరో వివాదంలో చిక్కు కున్నారు. 2022వ సంవత్సరం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆహ్వాన పత్రికల్లో ఎంపీ గురుమూర్తి ఫొటో, పేరు విస్మరించిన దేవ స్థానం అధికారులు, ఈ సారి ఎమ్మెల్సీ సభ్యు లను విస్మరించారు. ఆహ్వాన పత్రికలు అట్టహా సంగా విడుదల చేశారు. అందులో భారీగా ప్రోటోకాల్ తప్పిదాలు వెలుగు చూడ టంతో అందరూ విస్తుపోయారు. దాంతో పత్రికలు బయటకు రాకుండా అప్పటి కప్పుడే దాచేశారు. ముందు పేజీలో సీఎం ప్రోటోకాల్ ముద్రించాల్సి ఉండగా ఆలయప పాలక మండలి సభ్యుల పేర్లను అచ్చు వేశారు. ఇలాంటి వివా దాల ఆహ్వాన ప్రతికపై స్థానిక నేతగా ఉన్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఫొటో అచ్చు వేయ లేదన్న ప్రశ్న పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. దీనిపై ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు విలేఖర్ల సమా వేశంలో మాట్లాడుతూ.. ఆలయ చరిత్రలో ఇప్పటివరకు ఏ ఎమ్మెల్సీ ఫొటో కూడా వేయలేదన్నారు. ఈ సారి మళ్లీ ఆహ్వాన పత్రి కలు ముద్రించాల్సి వచ్చింది కాబట్టి జిల్లాలోని అందరి ఎమ్మెల్సీల చిత్రాలు పొందు పరుస్తామన్నారు. ఈ క్రమంలో మిద్దెల హరి ఇటీవల ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. గురువారం జరిగిన సమన్వయ సమావేశానికి ఆయన్ను ఆహ్వానించ లేదు. దీంతో ఆయన పలువురి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. క్యాబినెట్ స్థాయి కలిగిన తనను దేవస్థానం వారు విస్మరించడం ఎంతవరకు సమంజసమని ఆయన వాపోతు న్నట్టు తెలిసింది. అధికారులకు తెలియకపోయి నా మండలి అయినా ఎందుకు చొరవతీసుకో లేదన్నది రాజకీయంగా చర్చకు దారి తీస్తోంది.

# మూషిక వాహనంపై వాల్మీకేశ్వరుడి వైభోగం



గ్రామదేవత పొన్నియమ్మ పూజలు చేస్తున్న అర్చకులు, మూషిక వాహనంపై వాల్మీకేశ్వర స్వామి

నాగలాపురం, ఫిబ్రవరి 29: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో గురువారం మహా శివ రాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కుల్ స్థానిక గ్రామదేవత పొన్నియమ్మకు పంచామృతాలతో అభిషేకాలు చేసి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మ వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మంగళవాయిద్యాల నడుమ మహా హారతి సమర్పించారు. అనంతరం తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక అభిషే కాలు పూజలు చేశారు. మధ్యాహ్నం రుద్రా భిషేకం నిర్వహించారు. సాయంత్రం వాల్మీకేశ్వర స్వామి ఉత్సవ విగ్ర హాన్ని వివిధ రకాల పుష్పా లతో, పట్టు వస్త్రాలతో, బంగారు ఆభరణాలతో, దివ్యాంగ సుందరంగా ముస్తాబు చేసి మహా హారతి చేపట్టారు. అనంతరం మంగళ వాయి ద్యాలు, బాణ సంచా వెలుగుల నడుమ స్వామి వారిని మూషిక వాహనంపై గ్రామోత్సవం నిర్వ హించారు. ఈ పూజలకు సురుటుపల్లి గ్రామ స్తులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈ పూజలను ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీరెడ్డి, ఈవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు, సిబ్బంది పర్యవేక్షిం చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా నేడు శుక్రవారం పల్లకి వాహన సేవ జరగనుంది.

# సంక్షేమ పథకాలను రెట్టింపు చేస్తాం : ఎంపీ గురుమూర్తి


మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

నాగలాపురం, ఫిబ్రవరి 29: వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రపస్తుత ఇస్తున్న సంక్షేమ పథకాలను రెట్టింపు చేసి ఇస్తామని ఎంపీ మద్దిల గురుమూర్తి అన్నారు. నాగలాపురం పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి తిరుపతి ఎంపీ గురుమూర్తి సత్యవేడు నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత ఎమ్మెల్యే ఆదిమూలం కార్యకర్తలకు మొండి చేయి చూపించారన్నారు. అందు వల్ల ఏదో ఒక రూపాన పార్టీనుంచి వైదొలగి పార్టీ పెద్దలపై నిందలు వేశారని విమర్శించారు. సత్యవేడు ఎమ్మెల్యేగా నూకతోటి రాజేష్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు అపరంజి రాజు, జిల్లా కార్మిక శాఖ అధ్యక్షుడు బీరేంద్రవర్మ, నాయకులు మహేష్‌రెడ్డి, చిన్నదురై, మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: ఉపాధ్యాయ, ఉద్యోగుల పింఛన్‌దారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు మురళి, రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్రాది డిమాండ్ చేశారు. గురువారం ఉదయం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్సీ మధ్యంతర భృతి 30శాతం చెల్లించాలని, 11వ పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేసి డీఏలను 90 శాతం క్యాష్ రూపంలో తక్షణమే చెల్లించాలన్నారు. వైద్యఖర్చులకు సంబంధించి తిరిగి చెల్లింపులు, పింఛన్‌దారులకు అడిషనల్ క్వాంటర్ పింఛన్ 70నుంచి 75 వయసు మధ్య వారికి 10 శాతం, 75 నుంచి 80 ఏళ్ల మధ్య వారికి 15 శాతం మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రూప్ చంద్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. జిల్లా సబ్ కమిటీ మెంబర్ మునుస్వామి, ముని రాజా, కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులు ప్రారంభం

నాగలాపురం, ఫిబ్రవరి 29: నాగలాపురం నుంచి టీపీ కోట-చిన్న పాండూరు రోడ్డు మరమ్మతుల పనులకు ఎంపీ గురుమూర్తి గురువారం భూమపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వీలైనంత త్వరలో రోడ్డు పనులను పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూక తోటి రాజేష్, నాగలాపురం వైసీపీ సీనియర్‌నేతలు పాల్గొన్నారు.

**ఎన్నికల వేళ..**

నాగలాపురం చిన్నపాండు రోడ్డు విస్తరణను రూ. 32 కోట్ల నిధులతో చేపట్టేందుకు మూడేళ్ల క్రితం జిల్లా మంత్రులు భూమిపూజ చేశారు. అయితే పనులు మొదలు కాలేదు. శిలాఫలకం అలంకార ప్రాయంగా మారింది. సుమారు 18 కి.మీ మేర రోడ్డు పూర్తిగా ధ్వంసమై 25 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఆ రోడ్డు మరమ్మతు కోసం నియోజకవర్గ టీడీపీ నాయకుడు, జేడీ రాజశేఖర్ తన సొంత నిధులతో గుంతలు తేలిన రోడ్డుకు గ్రావెల్ తోలి చదును చేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రోడ్డు పనులు ప్రారంభిస్తామంటూ వైసీపీ నాయకులు చేసిన హడావిడి ప్రారంభోత్సవం డ్రామాను తలపిస్తోందని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

# ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సత్యవేడు, ఫిబ్రవరి 29: ఇంటర్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీసీ కెమెరాల నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు సంబంధిత పరీక్షల చీఫ్, ప్రిన్సిపాల్ జగన్మోహనాచార్యులు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 283 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 305 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. తొలి రోజు తెలుగు, తమిళం, హిందీ, ఉర్దూ వంటి పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష హాలులో లైట్లు, ఫ్యాన్లు, తాగునీటి వసతి కల్పించామన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కొనసాగుతుంది. పరీక్షలు రాసే విద్యార్థులందరూ అరగంటకు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. డిపార్ట్‌మెంట్ అధికారిగా జాకీర్ హుస్సేన్ వ్యవహరిస్తారు.

**వరదయ్యపాళెం:** వరదయ్యపాళెం జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు అన్నీ సిద్ధం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు.

# వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు


పార్టీలో చేరిన వారితో సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, ఫిబ్రవరి 29: తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం పంచాయతీకి చెందిన వైసీపీ నాయుకులు సుమారు 100మందికి పైగా టీడీపీలో చేరారు. గురువారం ఊరందూరు గ్రామంలో టీడీపీ శ్రీకాళహస్తి నియోజక వర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగృహం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. సుధీర్‌రెడ్డి వారికి పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిం చారు. పార్టీలో చేరిన వారిలో పంచాయతీ వైస్ ప్రసిడెంట్ చెంగయ్య, వార్డు మెంబర్లు కుమార్, దాము, శివ, సాంబయ్య, మాజీ రేషన్‌డీలర్ నాథముని తదితరులు ఉన్నారు. అనంతరం కాపుల ఆత్మీయ సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కాపుల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు కంఠా రమేష్, కమల్‌కుమార్, కాసరం రమేష్, మందల సుబ్రమణ్యం, పోలి ముని రామయ్య, ముచ్చువోలు నరసయ్య, అబ్బాబట్లపల్లి గోపాల్ నియోజకవర్గ కాపు నాయకులు పాల్గొన్నారు.

**జోరుగా టీడీపీ ప్రచారం**

టీడీపీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి చోడవరం, శేషమనాయుడుకండ్రిగ పంచాయతీలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, నాయకులు మునిరాజనాయుడు, కన్నలిప్రతాప్‌రెడ్డి, మునిరత్నం, మురళి, చంద్రారెడ్డి, చెంచురామిరెడ్డి, యర్రయ్య, సురేంద్ర, విజయ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.